నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 6 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సిర్పూర్(టీ), అక్టోబర్ 5 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. శనివారం మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్ కింద అధికారులు చేపట్టిన డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేల్లో తప్పులు లేకుండా చూడాలని, సర్వేకు గ్రామస్తులు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ బక్కయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని భూ నిర్వాసితుల వినతి



కలెక్టర్ కార్యాలయం ముందు భూ నిర్వాసితులు

నస్పూర్, అక్టోబర్ 5 : జైపూర్ మండలానికి చెందిన నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులు శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. ఆర్బిటేషన్ రూ. 50 లక్షలకుపైగా పెంచాలని వినతి పత్రం అందజేశారు. తమకు వ్యవసాయమే జీవనాధారమని, భూములు కోల్పోతే తమకు నష్టం జరుగుతుందని, పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14 తర్వాత హైవేను ఆనుకొని ఉన్న గ్రామాలను విజిట్ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు మల్లేశ్, రామరావు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, తిరుపతి, నారాయణ, రాజయ్య, బాపు, భూమయ్య, సతీశ్, మొగిలి, రాజపోశం పాల్గొన్నారు.



చీకట్లో రాజారం గ్రామ పంచాయతీ

## అంధకారంలో రాజారం

కోటపల్లి, అక్టోబర్ 5 : మండలంలోని మారుమూల గ్రామ పంచాయతీ రాజారంలో కరెంట్ వెలుగులు కరువయ్యాయి. యేటా బతుకమ్మ పండుగకు వీధి వీధినా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తుండగా, ఈసారి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో గ్రామస్తులు చీకట్లో అవస్థలు పడాల్సి వస్తున్నది. మహిళలు ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సర్కారు భూమి స్వాహా!

**ముల్కల్ల శివారులో 10 గుంటల ప్రభుత్వ భూమి కబ్జా**

- రూ. కోటిన్నర విలువ చేసే స్థలాన్ని ప్లాటింగ్ చేసిన రియల్టర్లు
- గజానికి రూ. 13 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధం
- నోటీసులిచ్చేందుకు టైమ్ లేదంటున్న కార్యదర్శి



ముల్కల్ల శివారులో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్

మంచిర్యాల, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ముల్కల్ల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వాహా చేయడం విమర్శలకు తావిస్తున్నది. రెండెకరాల పట్టాభూమిని కొనుగోలు చేసి, దాని పక్కనున్న 10 గుంటల సర్కారు స్థలాన్ని కలుపుకొని ప్లాటింగ్ చేసి విక్రయించేందుకు సిద్ధమవ్వగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నది. ముల్కల్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 169లో ముగ్గురు అన్నదమ్ములకు చెందిన 71 గుంటలు, మరో వ్యక్తికి చెందిన 22 గుంటలు మొత్తం 2.13 ఎకరాల భూమిని ఇద్దరు రియల్టర్లు కొనుగోలు చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 22న అగ్రిమెంట్ సైతం చేసుకున్నారు. మొత్తంగా నలుగురు వ్యక్తుల నుంచి 2.13 ఎకరాలు కొనుగోలు చేసిన ఆ వ్యాపారులు పక్కనే ఉన్న 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని మొత్తం 42 ప్లాట్‌లు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ వేసి గజానికి రూ.13 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని ప్లాట్లపై అగ్రిమెంట్ చేసుకొని కస్టమర్ల నుంచి అడ్వాన్సులు సైతం తీసుకున్నారు. ఈ లెక్కన వెంచర్‌లో కలిపేసిన 10 గుంటల ప్రభుత్వ భూమిపై రూ.1.57 కోట్లు సమకూర్చుకునేందుకు స్కెచ్ వేశారని తెలిసింది.




ప్రభుత్వ భూమి 10 గుంటలు కలిపి ఏర్పాటు చేసిన 42 ప్లాట్ల బ్రౌచర్

### నాలా కన్వర్షన్ చేసి అక్రమ రిజిస్ట్రేషన్..

లే-అవుట్ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా డీటీసీపీ అనుమతి తీసుకోవాలి. డీటీసీపీకి దరఖాస్తు చేసుకున్నాక గ్రామపంచాయతీకి కొంత భూమిని మార్టిగేజ్ చేసి మిగిలిన ప్లాట్లను విక్రయించాలి. ఇలా చేస్తే టైమ్ పట్టడంతో పాటు 10 శాతం ప్లాట్లు పంచాయతీ చేతిలోనే ఉండిపోతాయి. పైగా డీటీసీపీకి పోతే ఆక్రమించే 10 గుంటల వ్యవహారం బయటపడుతుందని.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్ ఏర్పాటు చేసేశారు. మరి అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు... అలా చేయడానికి రూల్స్ ఒప్పుకోవు కదా.. అని వెంచర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే.. నాలా కన్వర్షన్ చేసి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేపిస్తామని చెప్పారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అంతా సెట్ చేశామన్నారు. మరి అప్పుడైనా ఈ 10 గుంటల ప్రభుత్వ భూమిని ఎలా నాలా కన్వర్షన్ చేస్తారు.. అంటే రెవెన్యూ అధికారులకు సైతం ఆమ్యామ్యాలు ముట్టచెబుతామని, అన్నింటికి కలిపే ప్యాకేజీ సెట్ చేసుకున్నామంటూ సమాధానం చెప్పారు. అంటే డీటీసీపీ అనుమతి తీసుకోకుండా అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాలా కన్వర్షన్ చేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేపిస్తారన్న మాట. ఇది ఈ ఒక్క వెంచర్‌లోనే కాదు.. జిల్లాలో ప్రతి ఇల్లీగల్ వెంచర్‌లో జరిగే ప్రక్రియనేనని తెలిసింది. జిల్లాలో ఎంక్వైరీ చేస్తే ఇలాంటి వెంచర్‌లు వందకు పైగా బయట పడే అవకాశముంది.

### అధికారుల నిర్లక్ష్యం.. నోటీసులిచ్చే టైమ్ లేదు..

ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌పై గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చి ప్లాటింగ్ చేయకుండా అడ్డుకోవాలి. ఒకవేళ ప్లాటింగ్ చేసి ఉంటే ఆ వెంచర్‌లోని రోడ్లు, హద్దు రాళ్లను తొలగించాలి. కానీ విచిత్రం ఏమిటంటే ఈ ఇల్లీగల్ వెంచర్‌కు ఇప్పటి వరకు ముల్కల్ల పంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదే విషయమై ఇటీవల 'నమస్తే తెలంగాణ' పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సంప్రదించగా అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని యాజమానులను వచ్చి కలవమని చెప్పామన్నారు. మరి నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి కదా అని అధికారులను ప్రశ్నిస్తే.. రెండు రోజులు చూసి నోటీసులు ఇస్తామన్నారు. ఇదే విషయాన్ని నాలుగు రోజులయ్యాక మళ్లీ 'నమస్తే తెలంగాణ' పంచాయతీ కార్యదర్శిని అడుగగా.. ఎల్‌ఆర్‌ఎస్ పనుల్లో బిజీగా ఉన్నామన్నారు. కూర్చొని నోటీసులు తయారు చేసే తీరిక తమకు లేదన్నారు. అదేంటి సార్ రూల్స్ ప్రకారం నోటీసులు ఇవ్వాలి కదా అంటే.. ఎల్‌ఆర్‌ఎస్ బిజీ ఉందని, నెల రోజుల వరకు నోటీసులు ఇచ్చే పరిస్థితి లేదని, మీరు వార్త రాసుకున్నా పర్లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

### అమాయకులే బలి పశువులు..

ప్రభుత్వ భూమిలో ప్లాటింగ్ చేసి ఏదో రకంగా అమ్మేస్తారు. కానీ ఆ భూములు కొనుగోలు చేసే అమాయకుల పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో చేసిన నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. హైడ్రా పేరు చెప్పి నిద్రపోనివ్వకుండా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమార్కులకు అధికారులు ఇలా సహకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కుల విషయంలో కఠినంగా ఉంటామని చెబుతున్న కలెక్టర్ కుమార్ దీపక్.. ఇలా ప్రభుత్వ భూమిని వెంచర్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలంటున్నారు. అక్రమ వెంచర్ అని తెలిసినా అడ్డుకోకుండా చోద్యం చూసిన పంచాయతీ రాజ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరి కలెక్టర్ సార్ ఈ విషయంలో ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.



గోల్డ్ మెడల్ సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జట్టు

## గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా హ్యాండ్ బాల్ జట్టు

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 5 : నారాయణ్‌పేట్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు గోల్డ్ మెడల్ సాధించింది. అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన జట్టును శనివారం ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు సాంబశివరావు, ఫణిరాజా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా జట్టు విజయానికి సారథ్యం వహించిన కోచ్‌లు రాకేశ్, సాయి, విశాలను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్ సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి మీనా రెడ్డి, కోచ్ అరవింద్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

# కార్మికులకు అన్యాయం చేస్తారా?

**జాతీయ సంఘాలపై టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఫైర్**




శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబర్ 5 : 'జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు సర్కారుతో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నాయి. ఒక్కో కార్మికుడికి రూ. 4 లక్షల వాటా రాకుండా చేశాయి.' అని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సర్కారుకు లొంగిపోయి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. రూ. 4701 కోట్ల లాభాల్లో 33 శాతం అంటే రూ. 1551 కోట్లు కార్మికులకు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కేవలం రూ. 796 కోట్లు ఇస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దమ్ముంటే సింగరేణికి బకాయిలున్న రూ. 23 వేల కోట్లను తెప్పించాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన నిలబడి.. యాజమాన్య వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నదన్నారు. కార్మికుల కోసం సర్కారు అనుకూల సంఘాలు పోరాడలేవని, దీనివల్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కార్మికులు గమనించాలని కోరారు. కేసీఆర్ సర్కారులో కార్మికులకు అనేక హక్కులు, సౌకర్యాలు కల్పించామని, ఆయన వల్లే ఈ రోజు 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. రాజకీయజోక్యంతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. కొందరైతే ఎమ్మెల్యేలు జీఎంలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్నేహ పూర్వక వాతావరణం ఉండేదని తెలిపారు. 33 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గోదావరిఖని హెడ్డాఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టబోతున్నామని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ హాజరవుతారని, కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యర్శి బండి రమేశ్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర నాయకులు ముత్యాల రమేశ్, గొర్ల సంతోష్, మహిపాల్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనిధర్, కిషోర్, చిప్ప రమేశ్, తుర్రం శ్రీకాంత్, రాజేందర్, మధుకర్, చాట్ల రమేశ్ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించిన జీపీ వర్కర్లు

## పెండింగ్ జీతాలివ్వాలి

- జీపీ వర్కర్ల డిమాండ్
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు

నెన్నెల,అక్టోబర్ 5 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం నెన్నెల గ్రామ పంచాయతీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి వర్కర్లకు రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పలువురు మల్టీ పర్పస్ వర్కర్లు అక్కడికి చేరుకొని జీతాలు ఎప్పుడిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పండుగ పూట పస్తులు ఉంచుతారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆపై కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు.



వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్

## 'కాకా'కు ఘన నివాళి

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, అక్టోబర్ 5 : ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టరేట్‌లలో శనివారం మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, మోతీలాల్, ఎస్పీ శ్రీనివాసరావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, డీఆర్‌డీవో కిషన్, అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రత్యేకాధికారి ఇల్లంబర్తి

## సర్వే నివేదిక స్పష్టంగా ఉండాలి

**ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రత్యేకాధికారి ఇల్లంబర్తి**

నస్పూర్, అక్టోబరు 5 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే నివేదిక స్పష్టంగా రూపొందించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రత్యేకాధికారి, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఇల్లంబర్తి అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో సందేహాలు, పొరపాట్లు ఉంటే నివృత్తి చేసుకుని స్పష్టమైన నివేదిక రూపొందించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 9న వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక అందించాలన్నారు. అన్ని వర్గాల వారి నుంచి వివరాలు సేకరించాలన్నారు. మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు నిబంధనల ప్రకారం తొలగించి.. నూతనంగా వచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## నిత్యావసరాల ధరలు తగ్గించాలి

- సీపీఐ నాయకుల డిమాండ్
- బెల్లంపల్లిలో రాస్తారోకో

బెల్లంపల్లి, అక్టోబర్ 5 : రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి తదితర నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర ధరలు తగ్గిస్తామని ప్రకటించిన మోదీ ఇప్పుడు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, పూర్ణిమ, లక్ష్మీనారాయణ, ఉపేందర్, చంద్రమాణిక్యం, బాపు, అమృత,సోని, ఐలయ్య, రాంచందర్, రాజం, తిలక్, శ్రీను, ప్రశాంత్, తిరుపతి, మారాలు, రాజలింగం, వెంకటస్వామి, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నస్పూర్, అక్టోబరు 5 : వానకాలం వరి పంటకు సంబంధించి ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పౌరసరరాల అధికారి బ్రహ్మారావుతో కలిసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సీఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాలు సమావేశం ఏర్పాటు చేసుకొని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తీర్మానం చేసి వివరాలు అందించాలన్నారు. అర్హత, నిబద్ధత గల వారిని నిర్వాహకులుగా నియమించుకొని ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో 20 టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్, ఎలక్ట్రానికంగ్ వేయింగ్ యంత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగు సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రసీదు అందించాలని, టాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు.

## వర్షాల కోసం పూజలు

బెజ్జూర్, అక్టోబర్ 5 : వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, వరుణ దేవా.. కరుణించు అంటూ కుకుడ గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కప్పతల్లిని రోకలి మధ్యలో కట్టి ఊరేగించగా, ఆదివాసులు నీళ్లు పోసి పూజలు చేశారు.



కప్పతల్లికి పూజలు చేస్తున్న ఆదివాసులు

## సింగరేణి స్థలంలో హద్దుల ఏర్పాటు

**అడ్డుకున్న స్థానికులు.. అధికారుల వాగ్వాదం**

బెల్లంపల్లి, అక్టోబర్ 5 : మండలంలోని బూదాకలాన్ శివారులో గల సర్వే నంబర్ 172లో సింగరేణి అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. బూదాగెస్ట్ హౌజ్ ఏరియా బూదాకలాన్ రోడ్డులో 3.24 ఎకరాల్లో ట్రెంచింగ్ వేశారు. ఈ పనులను సింగరేణి సీనియర్ ఎస్టేట్ అధికారి స్వప్న, ఎస్టేట్ అధికారి వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఆ స్థలం తమదేనంటూ హద్దుల ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. వారితో అధికారులు వాగ్వాదానికి దిగారు. దీంతో న్యాయపరంగా వెళ్లి భూమిని స్వాధీనపరుచుకుంటామని సింగరేణి అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.